ఎడిటర్: రత్తం నాగరాజు
RNI . TELTEL / 2022 / 83463
జాతీయ దిన పత్రిక
# తరంగాలు
Tharangalu Daily News Paper
ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...
వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్,జయశంకర్ భూపాలపల్లి, ములుగు, జనగాం




ఉమ్మడి వరంగల్ జిల్లా
మంగళవారం, 30 డిసెంబర్, 2025

### గ్రామపంచాయతీ నిధుల వినియోగంలో
# కీలక మార్పు
## సర్పంచ్, ఉప సర్పంచ్ ఇద్దరి సంతకాలు తప్పనిసరి

చెక్కుల చెల్లింపులకు కొత్త నిబంధనలు
పారదర్శకత, జవాబుదారీతనమే లక్ష్యం
గ్రామాభివృద్ధి పనులకు కేటాయించే నిధులు సక్రమంగా వినియోగం కావాలంటే సమిష్టి బాధ్యత అవసరం




**హైదరాబాద్, డిసెంబర్ 29 (తరంగాలు ప్రతినిధి):** గ్రామపంచాయతీ నిధుల వినియోగంలో పారదర్శకత పెంచేందుకు ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఇకపై గ్రామపంచాయతీ నిధులకు సంబంధించి జారీ చేసే చెక్కులపై సర్పంచ్, ఉప సర్పంచ్ ఇద్దరి సంతకాలు ఉంటేనే బ్యాంకులు చెల్లింపులు చేయాలని స్పష్టం చేసింది. ఒకరి సంతకం మాత్రమే ఉన్న చెక్కులను స్వీకరించవద్దని బ్యాంకులకు సూచనలు ఇచ్చింది. పంచాయతీ నిధుల దుర్వినియోగాన్ని అరికట్టడం, గ్రామస్థాయిలో పాలనలో జవాబుదారీతనాన్ని బలోపేతం చేయడమే ఈ నిర్ణయానికి ప్రధాన ఉద్దేశ్యమని ప్రభుత్వం తెలిపింది. గ్రామాభివృద్ధి పనులకు కేటాయించే నిధులు సక్రమంగా వినియోగం కావాలంటే సమిష్టి బాధ్యత అవసరమని పేర్కొంది. ఈ నిబంధనను కఠినంగా అమలు చేయాలని అన్ని జిల్లాల కలెక్టర్లు, పంచాయతీ రాజ్ అధికారులు, సంబంధిత సిబ్బందికి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఎలాంటి మినహాయింపులు లేకుండా ప్రతి గ్రామపంచాయతీలో ఈ విధానం అమలులో ఉండాలని స్పష్టం చేసింది. ఈ నిర్ణయంతో గ్రామపంచాయతీల్లో ఆర్థిక వ్యవహారాల్లో నియంత్రణ పెరుగుతుందని, ప్రజలకు నిధుల వినియోగంపై మరింత విశ్వాసం ఏర్పడుతుందని ప్రభుత్వం అభిప్రాయపడుతోంది.

### యూరియా సమృద్ధిగా
# అందుబాటులో ఉంది
మంత్రి తుమ్మల నాగేశ్వర రావు



**వరంగల్ ప్రతినిధి, డిసెంబర్ 29,తరంగాలు:** రాష్ట్రంలో వ్యవసాయ సాగుకు అవసరమైన యూరియా సమృద్ధిగా అందుబాటులో ఉందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. సోమవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, వ్యవసాయ శాఖ రాష్ట్ర ముఖ్య కార్యదర్శి సభ్యసాచి గోష్, రాష్ట్ర వ్యవసాయ కార్యదర్శి కె.సురేంద్రమోహన్ లతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు 2

### ప్రజావాణి అర్జీలను త్వరగా
# పరిష్కరించాలి
## హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్


2

**హనుమకొండ ప్రతినిధి, డిసెంబర్ 29,తరంగాలు:** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమాన్ని వివిధ శాఖల అధికారులతో కలిసి

### తెలంగాణ ఉద్యమ కళాకారులకు
# ఉద్యోగాలు కల్పించాలి
తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



**హైదరాబాద్, డిసెంబర్ 29 (తరంగాలు ప్రతినిధి):** తెలంగాణ ఉద్యమ కళాకారుల సంఘం సభ్యులు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను కలిసి తమ సమస్యలను విన్నవించారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన కళాకారులకు తెలంగాణ సాంస్కృతి సారథి సంస్థలో ఉద్యోగాలు కల్పించేందుకు కృషి చేయాలని వారు కోరారు. ఎన్నికల సమయంలో తెలంగాణ ఉద్యమ కళాకారులకు ఉద్యోగాలు ఇస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని, అయితే అధికారంలోకి వచ్చి రెండేళ్లు అవుతున్నప్పటికీ ఇప్పటివరకు ఒక్క అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వలేదనికళాకారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమ సమయంలో 2

## సాండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కమిటీ సమావేశం


2

### జనవరి 25 నుంచి 31 వరకు
### మేడారం జాతరకు
# ప్రత్యేక బస్సులు



**ములుగు, డిసెంబరు 29 (తరంగాలు ప్రతినిధి):** తెలంగాణలోనేకాకుండా ప్రపంచవ్యాప్తంగా అతి పెద్ద గిరిజన జాతరగా గుర్తింపు పొందిన లిమేడారం సమ్మక్క సారలమ్మ జాతరలికు వెళ్లే భక్తులకు ఆర్టీసీ శుభవార్త చెప్పింది. దేశం నలుమూలల నుంచే కాకుండా విదేశాల నుంచి కూడా లక్షల మంది




తరలివచ్చే ఈ మహాజాతర నేపథ్యంలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక బస్సులను నడపాలని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నిర్ణయించింది. జనవరి 25 నుంచి 31 వరకు జరిగే జాతర రోజుల్లో ఈ ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయని ఆర్టీసీ అధికారులు తెలిపారు. 2

## నట్టల మందు పంపిణీని

# సద్వినియోగం చేసుకోవాలి

### గొర్రెలు,మేకలకు నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన

### పర్వతగిరి సర్పంచ్ చీదురు శంకర్



**పర్వతగిరి, డిసెంబర్ 29, తరంగాలు:** జీవాల పెంపకందారులు తమ జీవాలకు ప్రభుత్వం వారు ఉచితంగా పంపిణీ చేస్తున్న నట్టల మందు పంపిణీని సద్వినియోగం చేసుకోవాలని పర్వతగిరి సర్పంచ్ చీదురు శంకర్ కోరారు.పర్వతగిరి మండల కేంద్రంతో పాటు కల్లెడ గ్రామంలో పశువుల వైద్యాధికారి డాక్టర్ రాజు ఆధ్వర్యంలో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందుల పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అధితిగా పర్వతగిరి సర్పంచ్ చీదురు శంకర్ హాజరై గొర్రెలు,మేకలకు నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్బంగా సర్పంచ్ చీదురు శంకర్ మాట్లాడుతూ ఏటా నాలుగుసార్లు నట్టల నివారణ మందులు జివాలకు వేయాలని అన్నారు.పశుసంపద ఆరోగ్యం మెరుగుపడితే రైతుల ఆర్థిక స్థితి కూడా బలపడుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు పుల్లూరి రజనీకాంత్,ఎరసాని వెంకన్న,గోలుసుల ఐలయ్య, రామసాని వెంకన్న, గడ్డం కిష్టయ్య, జంగా రాములు,ఎరసాని సంతోష్, అధోండ బిక్షపతి, గోపాలమిత్రులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి అర్జీలను త్వరగా

# పరిష్కరించాలి

**మొదటి పేజీ తరువాయి**



జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కు అర్జీలను అందజేశారు. ప్రజలు అందజేసిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులకు పరిష్కార చర్యలు చేపట్టాలని కలెక్టర్ అక్కడికక్కడే ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో 167 అర్జీలను ప్రజలు అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా సంబంధిత శాఖల అధికారులు పరిష్కార చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్చార్జి అదనపు కలెక్టర్ వై. వి. గణేష్, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు రాథోడ్ రమేష్, డాక్టర్ కన్నం నారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# యూరియా సమృద్ధిగా అందుబాటులో ఉంది

**మొదటి పేజీ తరువాయి** కలెక్టర్లు, వ్యవసాయ, సహకార, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వరంగల్ కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యవసాయ సాగుకు అవసరమైన యూరియా అందుబాటులో ఉందని, కార్యచరణ ప్రకారం ప్రణాళికాబద్ధంగా రైతులకు పంపిణీ చేయాలని తెలిపారు. ఇందు కొరకు ప్రభుత్వం యూరియా యాప్ రూపొందించి రైతులకు అందుబాటులో ఉంచిందని, పైలట్ ప్రాజెక్టులో భాగంగా రాష్ట్రంలోని పెద్దపల్లి, నల్గొండ, జనగామ, ఆదిలాబాద్, మహబూబ్ నగర్ జిల్లాలను ఎంపిక చేసి మొదటగా అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఆయా జిల్లాలలో అమలవుతున్న యాప్ నిర్వహణపై జిల్లాల కలెక్టర్లు, అధికారులను వివరాలు అడిగి తెలుసుకుని యాప్ పై రైతుల అభిప్రాయం తెలుసుకోవాలని సూచించారు. యూరియా పంపిణీ కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నీడ, త్రాగునీరు ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని తెలిపారు. యూరియా పంపిణీ పై ప్రత్యేక అధికారులను నియమించి యూరియా సరఫరాలో ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా చర్యలు తీసుకోవడంతో పాటు నిరంతరం పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. రైతుల సౌకర్యార్థం రాష్ట్రస్థాయిలో టోల్ ఫ్రీ నంబర్ 1800 599 5770 ఏర్పాటు చేయడం జరిగిందని, జిల్లా స్థాయిలో హెల్ప్ లైన్ నంబర్ ఏర్పాటు చేయాలని, యూరియా పంపిణీ, రవాణాపై టాస్క్ ఫోర్స్ బృందాన్ని నియమించి, యూరియా తప్పు త్రోవ పట్టకుండా పర్యవేక్షించాలని తెలిపారు. యూరియా పంపిణీ సమయంలో పట్టాదారు పాసుపుస్తకం లో నమోదైన భూ విస్తీర్ణం ప్రకారం అవసరమైన యూరియా సంబంధిత రైతుకు అందించాలని, అవసరానికి మించి యూరియా పంపిణీ చేయవద్దని సూచించారు.వ్యవసాయ శాఖ రాష్ట్ర ముఖ్య కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో యూరియా నిల్వలు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని, యూరియా యాప్ ద్వారా ఆన్ లైన్ మాత్రమే కాకుండా ఆఫ్ లైన్ లో పంపిణీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఇందుకు అవసరమైన యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. యూరియా పంపిణీ కేంద్రాలలో రైతులకు ఇబ్బందులు లేకుండా మౌలిక సదుపాయాలు కల్పించాలని తెలిపారు. ప్రతి ప్రభుత్వ యూరియా పంపిణీ కేంద్రంలో బయట తప్పనిసరిగా కనీసం 3 కౌంటర్లు ఏర్పాటు చేయాలని, యూరియా బుకింగ్ మొబైల్ యాప్ 10 రోజులలో అమలు చేయడం జరుగుతుందని, యాప్ కు సంబంధించిన క్యూఆర్ కోడ్ ను ప్రతి యూరియా పంపిణీ కేంద్రంలో ప్రదర్శించాలని తెలిపారు. పంపిణీ కేంద్రంలో యూరియా పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండాలని, యూరియా కొరకు వచ్చిన రైతు తిరిగి వెళ్ళకుండా నిబంధనల ప్రకారం పంపిణీ చేయాలని తెలిపారు. ప్రతి రోజు రైతులకు పంపిణీ చేసిన వివరాలతో పాటు మిగిలి ఉన్న నిల్వలను పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని ఆదేశించారు. యూరియా పంపిణీ కేంద్రాలలో ప్రతిరోజు ఉదయం 6 గంటలకు పంపిణీ ప్రక్రియ ప్రారంభించాలని, యూరియా పంపిణీ పై రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, మండల వ్యవసాయ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సాండ్ ఎన్ఫోర్స్‌మెంట్ కమిటీ సమావేశం

### ఇసుక సరఫరాకు ఎలాంటి ఆటంకాలు లేకుండా వేగవంతంగా అభివృద్ధి పనులు చేపట్టాలి

### వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద




**వరంగల్ ప్రతినిధి, డిసెంబర్ 29,తరంగాలు:** వరంగల్ జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ లో సోమవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధ్యక్షతన సాండ్ ఎన్ఫోర్స్‌మెంట్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన ఇసుక సరఫరా అంశంపై కలెక్టర్ అధికారులసతో విస్తృతంగా చర్చించారు.ఇందిరమ్మ ఇళ్లకు అవసరమైన ఇసుకను భూపాలపల్లి జిల్లాలోని చిట్యాల, టేకుమట్ల ఇసుక రీచ్‌ల నుంచి సరఫరా చేసేందుకు టీజీఎండీసీ (టీజీఎండీసీఎల్) వారు కేటాయించినట్లు తెలిపారు.ఈ నేపథ్యంలో ఇసుక అవసరాల వివరాలతో భూపాలపల్లి జిల్లా కలెక్టర్ కు లేఖ పంపాలని పీడీ హౌసింగ్ అధికారిని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.అదేవిధంగా జిల్లాలో జరుగుతున్న ప్రభుత్వ ఇంజనీరింగ్ అభివృద్ధి పనులకు అవసరమైన ఇసుక పరిమాణాన్ని ఇంజనీరింగ్ విభాగాల వారీగా వెంటనే తెలియజేయాలని సంబంధిత శాఖలను ఆదేశించారు.జిల్లాలో ఇసుక సరఫరాకు ఎలాంటి ఆటంకాలు లేకుండా వేగవంతంగా అభివృద్ధి పనులు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సంబంధిత ఇంజనీరింగ్ విభాగాలను ఆదేశించారు.ఈ సమావేశంలో వరంగల్, నర్సంపేట ఆర్డీవోలు సుమ, ఉమారాణి , ఇన్చార్జి పీడీ హౌసింగ్ శ్రీవాణి, ఏడీ మైనింగ్ రవి కుమార్, పీఓ టీజీఎండీసీ , వర్ధన్నపేట,రాయపర్తి తహసీల్దార్లు విజయ్ సాగర్, శ్రీనివాస్ , శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

# మేడారం జాతరకు ఆర్టీసీ భారీ ఏర్పాట్లు

**మొదటి పేజీ తరువాయి**



ఖమ్మం రీజియన్ పరిధిలో మొత్తం 244 ప్రత్యేక బస్సులను మేడారంకు నడపనున్నారు. ఇందులో కొత్తగూడెం డిపో నుంచి 110 బస్సులు, ఇల్లెందు నుంచి 41, భద్రాచలం నుంచి 21, పాల్వంచ నుంచి 15, సత్తుపల్లి-ఏటూరునాగారం నుంచి 17, చర్ల నుంచి 3, వెంకటాపూర్ నుంచి 6, మణుగూరు నుంచి 16, మంగపేట నుంచి 5, ఖమ్మం నుంచి 10 ప్రత్యేక బస్సులు కేటాయించినట్లు ఆర్టీసీ వెల్లడించింది. భారీ భక్తుల రాకను దృష్టిలో ఉంచుకుని ఈ సంఖ్యను అవసరాన్ని బట్టి మరింత పెంచే అవకాశం ఉందని తెలిపింది. ఇక భూపాలపల్లి డిపో నుంచి కూడా మేడారంకు ప్రత్యేక బస్సులు నడపనున్నారు. ఘనపూర్, ములుగు, గోవిందరావుపేట, తాడ్వాయి, పస్రా, చల్వాయి మార్గాల మీదుగా ఈ బస్సులు తిరగనున్నాయి. ఉదయం 8 గంటల నుంచి రాత్రి వరకు నిరంతరంగా ఈ సేవలు అందుబాటులో ఉంటాయని అధికారులు తెలిపారు. ఈ ప్రత్యేక బస్సుల్లో మహాలక్ష్మి పథకం వర్తిస్తుందని, మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చని స్పష్టం చేశారు.

# తెలంగాణ ఉద్యమ కళాకారులకు ఉద్యోగాలు కల్పించాలి

**మొదటి పేజీ తరువాయి**

తమ కళలతో ప్రజలను చైతన్యవంతం చేసినప్పటికీ, ఇప్పుడు తమను విస్మరిస్తున్నారని వారు పేర్కొన్నారు.ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమంలో కళాకారుల పాత్ర చరిత్రాత్మకమని అన్నారు. ఉద్యమ కళాకారులకు ఉద్యోగాలు కల్పించాలనే డిమాండ్‌తో ఫోరం ఏర్పాటు చేసి పోరాటం చేస్తున్న వారికి తెలంగాణ జాగృతి సంపూర్ణ మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి ప్రధానంగా దోహదపడిన కళాకారులకు అండగా నిలుస్తామని ఆమె హామీ ఇచ్చారు.కళాకారులకు ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి అమలు చేయడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా, ఇందిరా పార్క్ వద్ద ఉద్యమ కళాకారులు చేపట్టనున్న ధర్నాలో తెలంగాణ జాగృతి కూడా పాల్గొంటుందని కవిత తెలిపారు. ఉద్యమ కళాకారులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని ఆమె స్పష్టం చేశారు.

# గ్రామ అభివృద్ధి లక్ష్యంగా పనులకు శ్రీకారం


**ఆలయాల పరిశుభ్రత,చెరువు కట్ట అభివృద్ధి,ఉచిత పశు వైద్య సేవలతో నల్లబెల్లిలో సమగ్ర గ్రామాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన సర్పంచ్ జక్కి అనిత శ్రీకాంత్,ఉపసర్పంచ్ మేకల దేవేందర్**





**వర్ధన్నపేట ప్రతినిధి, డిసెంబర్ 29,తరంగాలు:** గ్రామ అభివృద్ధి లక్ష్యంగా నల్లబెల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ జక్కి అనిత శ్రీకాంత్ ఆధ్వర్యంలో పలు అభివృద్ధి పనులను సోమవారం ప్రారంభించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాలు చేపట్టినట్లు సర్పంచ్ తెలిపారు. ఈ అభివృద్ధి పనులలో భాగంగా గ్రామంలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం పరిసరాల్లో ఉన్న ముళ్లపదలను తొలగించడం, అలాగే గ్రామంలోని ఇతర పురాతన ఆలయాల్లో ఆలయాభివృద్ధి కోసం పరిశుభ్రత పనులు ప్రారంభించారు. అదేవిధంగా గ్రామంలోని చెరువు కట్టపై ప్రయాణికులకు ఇబ్బందికరంగా ఉన్న ముళ్లపదలను తొలగించే పనులు చేపట్టారు. అనంతరం గ్రామంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గొర్లకు నటల నివారణ కోసం ఉచిత మందుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా పశుపోషకులకు మేలు చేకూరుతుందని అధికారులు తెలిపారు. గ్రామాభివృద్ధికి ప్రజల సహకారం ఎంతో అవసరమని భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి నల్లబెల్లి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని సర్పంచ్ జక్కి అనిత శ్రీకాంత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ మేకల దేవేందర్, వార్డు సభ్యులు బిర్రు సబిత చంద్రయ్య, వెటర్నరీ హాస్పిటల్ డాక్టర్ విజయేందర్, కుల సంఘ పెద్దలు గొల్లపల్లి యాదగిరి, పోలసాని దేవేందర్రావు, మరిపట్ల బాబు, కురుమ సంఘం అధ్యక్షులు కొన్నీ లింగం, బొజ్జ కృష్ణమూర్తి, తక్కలపల్లి శ్రీకాంత్ రావు, కుల సంఘ పెద్దలు బిర్రు యాకయ్య, బోడపట్ల కొమురయ్య, రాజు గట్టయ్య, బొజ్జ నాగయ్య, బొమ్మెర శ్రీనివాస్, గజ్జల వేణు, గజ్జల దేవేందర్, బిర్రు రాములు, బిర్రు చంద్రయ్య, జర కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ సరఫరాకు అంతరాయం




**వర్ధన్నపేట ప్రతినిధి, డిసెంబర్ 29,తరంగాలు :** వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామంలోని విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో గల పలు గ్రామాల్లో నేడు (మంగళవారం) విద్యుత్ మరమత్తుల కారణంగా సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ అధికారులు ఏడిఈ నటరాజ్, ఏఈ తరుణ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఇల్లంద విద్యుత్ సబ్ స్టేషన్ లో మరమ్మతుల కారణంగా ఇల్లంద, కట్ర్యాల, కడారి గూడెం, కుమ్మరిగూడెం,రాంధాన్ తండా గ్రామాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఆయా గ్రామాల్లో గృహ వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని విద్యుత్ శాఖ అధికారులు ఏడిఈ నటరాజ్, ఏఈ తరుణ్ విజ్ఞప్తి చేశారు.

# ఆడెపు ఓవర్సీస్ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



**వరంగల్ డిసెంబర్ 29,తరంగాలు :** ఆడేపు ఓవర్సీస్ సంస్థ రూపొందించిన 2026 సంవత్సర నూతన క్యాలెండర్ను ప్రముఖులు ఆవిష్కరించారు. వరంగల్ చౌరస్తాలోని కె కన్వెన్షన్ హాల్ లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు, విద్యావేత్తలు పాల్గొన్నారు. క్యాలెండర్ ఆవిష్కరణ అనంతరం మాట్లాడిన ప్రముఖ అతిథులు యువత విదేశాల్లో ఉన్నత విద్య తద్వారా దేశ ప్రతిష్టను పెంచే విధంగా ఈ సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు. విద్యార్థులకు సరైన మార్గదర్శనం, పారదర్శక సేవలే ఈ సంస్థ విశ్వసనీయతకు నిదర్శనమని చెప్పారు. సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ%ా% విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా వీసా ప్రాసెస్, కౌన్సిలింగ్, యూనివర్సిటీ ఎంపిక వంటి విషయాల్లో నాణ్యమైన సేవలు అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా సంస్థ వార్షిక కార్యకలాపాల పై వివరాలను ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఐఏఎస్ పరికిపండ్ల నరహరి, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, వన్నాల వెంకటరమణ, బిజెపి స్పోక్స్ పర్సన్ ఆడపు వెంకటేష్ బేతి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహంతో బాల్యాన్ని చిదిమేయొద్దు

**పర్వతగిరి సర్పంచ్ చీదురు శంకర్**





**పర్వతగిరి, డిసెంబర్ 29,తరంగాలు :** పర్వతగిరి మండల కేంద్రంలో మారి సంస్థ వారు బాల్యవివాహాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పర్వతగిరి సర్పంచ్ చీదురు శంకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మాయిలకు చిన్నతనంలో పెళ్లి చేసి వారి ఉజ్వల భవిష్యత్తును బలి చేయవద్దు అని తల్లిదండ్రులను కోరారు. ఆడపిల్ల చదువు ఇంటికి వెలుగు అని సమాజంలో వారి ఎదుగుదలకు విద్య ఒక్కటే ఏకైక మార్గమని అన్నారు. 14 సంవత్సరాల లోపు పిల్లలతో పని చేయించవద్దు అని బాల కార్మిక వ్యవస్థ చట్టరీత్యా నేరమని అన్నారు. ఇలాంటి సాంఘిక దురాచారాలపై అందరూ కలిసికట్టుగా పోరాడి వాటిని నిర్మూలించాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, సత్ప్రవర్తన కలిగి క్రమశిక్షణతో చదువుకొని జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పర్వతగిరి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నవీన్ కుమార్,పర్వతగిరి ఏఎస్ఐ , ఎమ్మార్సీ స్టాఫ్ గారె జయరాజ్, మారి



సంస్థ ప్రతినిధులు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మృతురాలి భౌతిక దేహానికి మాజీ పిఏసిఎస్ చైర్మన్ కొడగాని నివాళి



**వర్ధన్నపేట ప్రతినిధి, డిసెంబర్ 29,తరంగాలు :** మృతురాలి భౌతిక దేహానికి మాజీ పిఏసిఎస్ చైర్మన్ కౌడగాని రాజేష్ ఖన్నా నివాళులర్పించి, బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేశారు. వర్ధన్నపేట మండలం కొత్తపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి నల్లతిగల రవి అమ్మ అయినా నల్లతిగల లింగమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెల్సుసుకున్న వర్ధన్నపేట మాజీ పాక్స్ చైర్మన్ కౌడగాని రాజేష్ ఖన్నా మృతురాలి భౌతిక దేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 4000 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షులు తాళ్లపెల్లి యాదగిరి, తాళ్లపెల్లి బచ్చయ్య, కోతి సాంబమూర్తి, బీసుపాక మల్లేష్, అనుముల యాదగిరి,రాయపురం సాంబరాజు, శివ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందికి సహకరించాలి

**కుష్టు నివారణ ప్రోగ్రాం అధికారి డాక్టర్ మోహన్ సింగ్**



**వరంగల్ ప్రతినిధి, డిసెంబర్ 29,తరంగాలు :** ప్రజలు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందికి సహకరించాలని కుష్టు నివారణ ప్రోగ్రాం అధికారి డాక్టర్ మోహన్ సింగ్ అన్నారు. సోమవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సాంబశివరావు ఆదేశాల మేరకు కుష్టు నివారణ ప్రోగ్రాం అధికారి డాక్టర్ మోహన్ సింగ్ కాశిబుగ్గ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో పర్యవేక్షించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించి, లక్షణాలు ఉన్న వారిని గుర్తించి వారికి తగిన పరీక్షలు చికిత్సలు అందించాలని సిబ్బందికి సూచించారు.ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి శిక్షణ పొంది ఉన్న వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందికి సహకరించాలని కోరారు. వరంగల్ జిల్లాను కుష్టు నివారణ జిల్లాగా చేయడానికి ప్రతి ఇంటికి వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఆశా కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలు ,ఆరోగ్య పర్యవేక్షకులు, ప్రతిరోజు ఉదయం 6 గంటల నుండి 9 గంటల వరకు గృహ సందర్శన చేసి ఎవరికైనా ఎలాంటి అనుమానిత మచ్చలు ఉన్న వాటిని పరీక్షించి వెంటనే వైద్యాధికారి పరీక్షల ద్వారా నిర్ధారణ చేసి వారికి కావలసిన మందులు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం 31 డిసెంబర్ 2025 వరకు నిర్వహిస్తున్నారని తెలిపారు. కుష్టు వ్యాధి సాధారణంగా అన్ని వ్యాధులలాగే వచ్చే వ్యాధి దీనిని ఎవరు కూడా నిర్లక్ష్యం చేయకుండా తగిన చికిత్సలు తీసుకుంటే నయమవుతుందన్నారు.కావున వైద్య ఆరోగ్యశాఖ సూచనల మేరకు తగు చికిత్సలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో , కాశిబుగ్గ పట్టణ ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ కిరణ్, డిప్యూటీ డెమో అనిల్ కుమార్, ఆరోగ్య కార్యకర్త శైలజ, ఆశా కార్యకర్తలు కమల, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

# అమృతం

ప్రియతమ నాయకుడి
విగ్రహాలకు పాలాభిషేకాలంట

దొంగ స్వాముల పాదములకు
పాలాభిషేకాలంట

పాల్లేక ఆకలితో అలమటించే
శిశువుల రోదనలు మరిచిపోయినారా

ఆకలితో అలమటిస్తు కాటికి కాలు చాపిన
వృద్ధ రోగులను మరిచిపోయినారా

ఆయువు నిలబట్టాల్సిన క్షీరం
ఆవిరై పోతుంటె గోమాత
పడిన బాధ మరిచిపోయినారా

లేగదూడల కడుపు కొట్టి
పితికిన పాలను హీరో పోస్టర్లకి
అభిషేకాలు చేస్తూ
దూడల అరుపులు మరిచిపోయినారా

ఎంతోమంది ప్రాణాలు కాపాడే
అమృతాన్ని వృధా కాకుండా
చూడాలని కోరుకుంటూ

రచన మంజుల పత్తిపాటి
మాజీ ఆలేరు వ్యవసాయ
మార్కెట్ కమిటీ డైరెక్టర్
యాదాద్రి భువనగిరి జిల్లా
తెలంగాణా రాష్ట్రం
చరవాణి 9347042218



## కడారి గూడెం చెరువు ఆక్రమణపై

# అలసత్వం వహిస్తున్న అధికారులు




**వర్ధన్నపేట ప్రతినిధి, డిసెంబర్ 29,తరంగాలు:** కడారి గూడెం చెరువు ఆక్రమణకు గురి అవుతుందని దానివల్ల ప్రజలకు మరియు రైతులకు ఇబ్బంది కలుగుతుందని ప్రభుత్వ అధికారాలకు ఎన్నిసార్లు విన్నవించుకున్న ప్రభుత్వ అధికారులు ఇప్పటివరకు విషయాన్ని పట్టించుకోకుండా మొద్దు నిద్ర అవస్థ లో ఉన్నారని భారతీయ జనతా పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మహేందర్ రెడ్డి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా పాలనలో భాగంగా గత సంవత్సరం జనవరి నెల 22వ తారీకు కడారి గూడెంలో నిర్వహించిన గ్రామసభకు హాజరైన కలెక్టర్ కు కడారి గూడెం చెరువు ఆక్రమణకు గురవుతుందని గ్రామ ప్రజలు అందజేసిన విజ్ఞప్తి పత్రం అంద చేయగా దీనిపై కలెక్టర్ సంతకం చేసి విచారణ చేయాలని సంబంధిత అధికారులు ఎమ్మార్వో కు, కిందిస్థాయి అధికారులకు ఆదేశించినప్పటికీ ఇప్పటికీ దానిపై ఎటువంటి చర్య తీసుకోకుండా అధికార పార్టీ నాయకుల ప్రలోభాలకు పాటుపడుతూ అధికారులు పనిచేస్తున్నారని మహేందర్ రెడ్డి ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు ఈ విషయంపై చర్య తీసుకోకపోతే గ్రామస్తులు అందరితో కలిసి నిరాహార దీక్షకు సిద్ధమవుతామని నిరసన తెలిపి అధికారుల కళ్ళు తెరిచే విధంగా చేస్తామని మహేందర్ రెడ్డి అధికారులకు మరియు ప్రభుత్వానికి హెచ్చరిక పంపారు. అధికార పార్టీ నాయకులకు వంత పాడుతున్న అధికారులు తమ విధానం మార్చుకోకపోతే అన్ని రకాలుగా మా దగ్గర ఉన్న ఆధారాలు చూపి మీరు ఏరకమైన పని చేస్తున్నారో బయట పెడతామని కూడా మహేందర్ రెడ్డి అన్నారు.

### ఇంతే జార్ గుంజ్ పోలీస్ స్టేషన్ ను తనికి చేసిన

# సెంట్రల్ జోన్ క్రైమ్ డిసిపి దార కవిత




**వరంగల్ ప్రతినిధి, డిసెంబర్ 29,తరంగాలు :** వార్షిక తనిఖీలో భాగంగా సోమవారం ఇంతే జార్ గుంజ్ పోలీస్ స్టేషన్ ను సెంట్రల్ జోన్ క్రైమ్ డిసిపి దార కవిత తనిఖీ చేశారు.ఈ సందర్బంగా మూడు సంవత్సరాలకు సంబంధించిన కేసుల గురించి ఆరా తీసి, పోలీస్ స్టేషన్ అధికారులు మరియు సిబ్బంది పనితీరుకు సంతృప్తి చెందింది. అంతేకాకుండా పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీలు, కేడీలు, డిసీలు మరియు సస్పెక్ట్ ల గురించి వారు ప్రస్తుతం చేస్తున్న కార్యకలాపాల గురించి తెలుసుకొని, ఇంతజారుగంజ్ ఇన్స్పెక్టర్ మరియు సబ్ ఇన్స్పెక్టర్లు,సిబ్బందితో మాట్లాడి అందరూ ప్రివెంటివ్ పోలీస్ పైన ఎక్కువగా ఫోకస్ చేసి నేరాలు నిరోధించాలని, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ ఎటువంటి అసాంఘిక చర్యలు జరగకుండా చూడాలని, శాంతిభద్రతలు కాపాడాలని తెలిపారు. సిబ్బందికి కూడా ఏవైనా ఇబ్బందులు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకు రావచ్చు అని, వాటి పరిష్కారానికి ప్రయత్నిస్తానని భరోసా ఇవ్వడం జరిగింది. ఈ ఇన్స్పెక్షన్ లో వరంగల్ సబ్ డివిజన్ పోలీస్ అధికారి ఏఎస్పి శుభం నగరాలే , ఇన్స్పెక్టర్ యంఏ షుకుర్ ఇంకా సబ్ ఇన్స్పెక్టర్లు మరియు ఇంతే జార్ గంజ్ పోలీస్ స్టేషన్లో సిబ్బంది పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం 26,000 ఇవ్వాలి

**తొర్రూరు,డిసెంబర్ 29,తరంగాలు :**దేశంలో కార్మిక వర్గానికి కనీస వేతనం 26,000 ఇవ్వాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టి యు సి ఐ) మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు కొత్తపల్లి రవి అన్నారు. తొర్రూర్ మున్సిపల్ కార్మికుల సమస్యలపై తొర్రూర్ మున్సిపల్ కమిషనర్ శ్యాం కుమార్ కు వినతిపత్రం నేడు ఇవ్వడం జరిగింది. దేశవ్యాప్తంగా వివిధ రకాల సరుకుల వస్తువుల ధరలు పెద్ద ఎత్తున పెరిగిన నేపథ్యంలో ఒక కార్మిక కుటుంబం జీవించటానికి నెలకు కనీసం 26,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ధనిక వర్గాలకు ఇస్తున్న సబ్సిడీలను, రుణమాఫీలతో పోల్చుకుంటే రెక్కలు ముక్కలు చేసుకుని చెమటలు చిందిస్తున్న కార్మిక వర్గానికి కనీస వేతనం పెద్ద సమస్య కాదని అన్నారు. మున్సిపల్, గ్రామపంచాయతీ, కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ తదితర చిరు ఉద్యోగులకు నెల నెల పెరుగుతున్న ఖర్చులతో అష్ట కష్టాలు అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు స్పందించి వెంటనే కనీస వేతనాన్ని అమలు చేయాలని లేదంటే ఆందోళన చేయక తప్పదని హెచ్చరించారు. తొర్రూర్లో మున్సిపల్ కార్మికులకు 15నెలలుగా రాని సబ్బులు కొబ్బరి నూనెల బిల్లులు వెంటనే ఇవ్వాలని కమిషనర్ను కోరారు. ఈఎస్ఐ సౌకర్యం పూర్తిస్థాయిలో కల్పించాలని ఆయన అన్నారు. స్పందించిన కమిషనర్ పై సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టి యు సి ఐ తొర్రూర్ డివిజన్ కార్యదర్శి ఎండీ శరీఫ్,తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు వేర్పుల మహేందర్ తొర్రూర్ యూనియన్ అధ్యక్షుడు మంగళపల్లి రామస్వామి,మాచర్ల మురళి సోమయ్య అర్వపల్లి వెంకన్న సురేష్ నరసమ్మ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు...